బ్రదర్, మీ నాన్నగారు పోయినందుకు నా బాధ్యతా లోపం కూడా వుంది. క్షమించు...." అనేశాడు.

"ఏం చేస్తాం సార్! బాధపడ్డం వరకే. అయినా ఈ దేశంలో రోజూ యిలాంటి హత్యలు యెన్ని జరగడం లేదంటారు. ఇంతకీ సార్...." గాంధీ కంఠం ఆగింది.

"చెప్పు. ఏమన్నా సహాయం కావాలా?"

"కాదు సార్. హంతకుడి ఆచూకీ తెలిసిందా సార్"

విశాలరావు క్షణం ఆగి "సోమేశ్వరం అని...."

అంతే చెప్పగల్గాడు కంఠంలోంచి మాట పెగలలేదు.

"సోమేశ్వరమా?"

"నక్సలైట్ లీడర్."

"కాదండి ఇన్‌స్పెక్టర్. ఇది అన్యాయం. మా నాన్నని అతను చంపడు. సోమేశ్వరం నా క్లాస్‌మేట్. మా నాన్న అతనికి ప్రాణం. అతని సంగతి నాకు బాగా తెలుసు. ఇది దొంగ కేసు సార్."

విశాలరావుకు గాంధీ ఎదురుగా నిలబడి సవాల్ చేస్తోన్నట్టుగా వుంది....తల వంచుకున్నాడు.

"అతన్ని వదిలేయండి సార్. దొంగ కేసులు పెట్టి మెరికల్లాటి కుర్రాళ్ళన్ని చంపకండి సార్. జరిగింది జరిగినట్టు కేసెట్టి—ఆ కేసులో యిరుక్కున్నది యెంత పెద్దోళ్ళయినా వాళ్ళని ఏరి పారేయండి సార్. సోమేశ్వరం అమాయకుడు. మీలా నాలా సోమేశ్వరం యువకుడు సార్. ఉద్యోగం దొరికితే, మీలా ఇన్‌స్పెక్టర్ అయ్యేవాడు. లేకపోతే నాలా స్కూల్‌మేష్టర్‌గా బ్రతికేవాడు. యువతరం, యిలా యువతరంమీద కత్తి గట్టడం అన్యాయం సార్.. మనం మనం ఒకటి సార్....!"

ఏసురత్నం కొడుకు ఫోనులో ఉద్వేగాన్నీ, ఉప్పెనలా ఆవేశాన్ని నింపి ఆకాశంనుంచి అశరీరవాణిలా వాక్కులు వినిపిస్తున్నాడు.

"నువ్వు చెబితే లాభంలేదు. ఏ పెద్దవాళ్ళ చేతో ఓ అరగంటలో తెల్లవారేలోపున ఫోన్ చేయించు. అంతేగానీ నీ నా రెకమెండేషన్‌తో అమాయకులు గానీ ఎవర్నిగానీ రక్షించలేం. దోషుల్ని శిక్షించలేం" విశాలరావు నెమ్మదిగా అన్నాడు.

"అలాగే సార్! ప్రయత్నిస్తాను. ఓ గంట టైం యివ్వండి."

విశాలరావు తెల్లవారే వరకూ అదే కుర్చీలో అంతే ఆతృతతో, కూర్చున్నాడు. నిద్ర కాజాడు. గుండెల్లో రేగే మంటని అదిమి పట్టుకున్నాడు.

తెల్లవారింది! బాగా వెలుగూ వచ్చింది. కానీ ఫోన్‌కాల్ రాలేదు.

ఫోన్ రాలేదన్న బాధతో గుండెల్లో గుబులుతో కుర్చీలోంచి లేవబోయి—శరీరం లోపలి మానవత మందలింపుగా నెత్తిమీద మోదినట్టయి అదే కుర్చీలో కూలబడిపోయాడు విశాలరావు.

కళ్ళు ఎందుకో సోమేశ్వరం కోసం అన్నట్టుగా రెండు కన్నీటిచుక్కల్ని ఆఖరి వీడ్కోలికి గుర్తుగా వదిలాయి. అందుకే ఏమీకానీ, ఎవరూలేని సోమేశ్వరం కోసం తన ఉద్యోగానికి రాజీనామా పత్రం వ్రాయడానికి కలం తీశాడు విశాలరావు. □

---

## స్వప్న సముద్రం

సముద్రం నిద్రిస్తే
ఆకాశం కలలోకొస్తుంది
పిగనిండా చుక్కల్ని తురుముకుని
కళ్ళనిండా కాటుక రేఖల్ని దిద్దుకుని-
కల చెదిరినట్లు బెదిరితే
కలలోనే సముద్రం,
తలనిండా
యుద్ధ విమానాల రెక్కల్ని గుచ్చుకుని
సముద్రమైదానం మీద
కురుస్తోంది వికృతంగా ఆకాశం

—దేవిప్రియ




యూనివర్సిటీ పరీక్షలు అయిపోయాయి. విద్యార్థు లందరిలోనూ ఇళ్ళకు వెళ్ళాలనే తొందర. మెస్సులో భోంచేసి సామానులు సర్దుకోడానికి రూముకు వచ్చాను. ఎండాకాలమైనా యెందుకో చలి వేస్తోంది. రూములో లైట్ వేసి సిగరెట్టు వెలిగించుకున్నాను. టైము దాదాపు తొమ్మిదవుతోంది.

ఆకాశవాసు లెవరో భూలోకాన్ని తాళ్ళతో బంధించినట్లు సన్నని తుంపర ప్రారంభమైంది. ప్రొద్దున్నే తిరుపతి వదలి వెళ్ళిపోతాననుకుంటే ఎందుకో బాధగా వుంది. ఎం. ఏ. పూర్తి చేసిన యీ రెండు సంవత్సరాల కాలంలోనూ ఎన్నో అనుభవాలూ, హృదయంలో హత్తుకొన్న సంఘటనలూ, జీవితంలో మరచిపోలేని గుణపాఠాలు.

మొదటి సంవత్సరం హాస్టలులోనే వున్నా, బాగా చదవాలనే వుద్దేశంతో లోన్లీగా వున్న ఈ రూములో ఒంటరిగా చేరాను. రాత్రిపూట అక్కడక్కడా దీపాలతో నును చీకటి, గాలిని కవ్వించే పూలచెట్లు, దూరంగా సున్నని కొండలు, ప్రశాంతమైన నిశ్శబ్దం, యెంత బావుంది ఈ రూము. ప్యాక్ చేసిన పుస్తకాల వంక ఒకసారి చూసి యిందాక సగం రాసి వదిలేసిన కథను చేతికి తీసుకున్నాను.

తలుపు శబ్దం కావడంతో లేచి ఎవరా? అనుకుంటూ తలుపు తెరిచాను.

ఆకాశం మెరిసింది. ఎదురుగా తడిసీ తడవని శ్లేష. ఆశ్చర్యపు పిడుగులు. యూనివర్శిటీని గడగడ లాడించిన శ్లేష. అందంతో అందరినీ బానిసల్ని చేసుకొన్న శ్లేష. పురుషుల్ని దుస్తుల్ని మార్చినట్లు మార్చి పురుగుల్లా చూసే శ్లేష. చూపుల్ని ఆకాశంపైకి తప్ప క్రిందికి దించని శ్లేష. రెండేండ్లు మౌనంగా నేను ఆరాధించిన శ్లేష. ఎవ్వరికీ అర్థంకాక శేషప్రశ్నలా మిగిలిన శ్లేష.

"ఏం రాజూ! రూములోకి రానీవా?" రాళ్ళపై కొండవాగు దూకుతున్నప్పటి శబ్దం.

"రా శ్లేషా!" తేరుకొని ఆహ్వానించాను.

రూములోకి ప్రవేశించి కుర్చీలో కూర్చుంది.

"చలేస్తోంది రాజూ! తలుపు వేసేయ్."

మంత్రముగ్ధుడిలా తలుపులు మూసి పరుపుపై కూర్చున్నాను.

"అలా వున్నావేం?...." అంది తలెగరేస్తూ.

"అబ్బే యేంలేదు" ఆశ్చర్యం నుంచి, ఆనందంనుంచి తేరుకొంటూ అన్నాను.

మెల్లగా సిగరెట్ తీసి వెలిగించుకో బోయాను.

"నాకో సిగరెట్టివ్వు రాజూ!" అధికార స్వరం.

"శ్లేషా! నువ్వు సిగరెట్లు కాలుస్తావా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం కాల్చకూడదా?" అంది తాపీగా చేయి చాస్తూ.

"ఆఁహ కాల్చకూడదని కాదు...." సిగరెట్ ప్యాకెట్ ఆమె కందించాను.

ఎన్నో ఏళ్ళనుండి కాలుస్తున్న దానిలా పొగ గుండెల నిండా పీల్చి బయటికి వదిలింది.

నేను ఆమెనే చూస్తున్నాను.

"రాజూ! ఈ రోజు నీతో గడపాలని వచ్చాను—ఏమంటావ్?"

"అలాగే—అంతకంటేనా" అన్నాను.

ఆమెకు తెలుసు—ఆమె యూనివర్శిటీలో చేరిన మొదటిరోజునుంచి ఆమెను మౌనంగా నేను ఆరాధిస్తున్నానని.

బయట చినుకుల శబ్దం హెచ్చింది. శ్లేషనే చూస్తూ ఈ హఠాత్తుగా రావడంలో గల ఆంతర్యం ఆలోచిస్తున్నాను.

కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్న శ్లేష హఠాత్తుగా కళ్ళు తెరచి "సరదాగా వుందామని వస్తే ఏమిట్రాజా ఈ మౌనం" గోముగా చూస్తూ శ్లేషగా ప్రశ్నించింది.

"మౌనం కాదు శ్లేషా, ఆలోచనలయానం, అంతుచిక్కని ప్రశ్నల అల్లిక" అన్నాను.

"ఏమిటో ఆ ప్రశ్నలు?...." కొంటెగా అడిగింది.

"అడిగితే చెబుతావా?" చెబుతుందో లేదో అనే అనుమానం.

"రాత్రిపూట ఒంటరిగా, నువ్వు పిలువకుండా, నీ రూముకు వచ్చినదాన్ని ఇంతేనా నీవు అర్థం చేసుకొన్నది. చెప్పగలిగే జవాబులైతే తప్పక" అంది సీరియస్‌గా.

మరో సిగరెట్ వెలిగించుకొని ఫ్లాస్కులో వున్న కాఫీని రెండు భాగాలు చేసి ఆమెకో టిచ్చాను.

మౌనంగా తాగుతోంది.


"శ్రీనాధ్ ఆత్మహత్యలో నీ భాగం ఎంత?" సూటిగా అడిగేశాను.

నా కళ్ళలోకి చూసి నవ్వుతూ "అంతా" అంది.

ఒక జీవితానికి సంబంధించిన ప్రశ్నకు యింత తేలిగ్గా సమాధానం యిచ్చిన ఈ స్త్రీని








యింకేం ప్రశ్నించను? ఆలోచనలను శ్రీనాధ్ ఆక్రమించుకొన్నాడు.

* * *

కొత్తగా ఎం. ఏ. ప్రీవియస్‌లో చేరిన రోజులు.

అందరికంటే ఆలస్యంగా చేరింది శ్లేష. ఆమె క్లాసుకు వస్తోందని తెలిస్తే ఒక్కడూ ఆబ్సెంటయ్యేవాడు కాదు. అంతటి అందం ఆమెది. తన డిపార్టుమెంటు కాని వాళ్ళతో కూడా చాలా ఫ్రీగా, సోషల్‌గా వుండేది.

ఆమె చూపుల్లో శ్లేష, మాటల్లో శ్లేష, నడకలో శ్లేష, నవ్వులో శ్లేష. అందరికీ అర్థంకాని సందిగ్ధం ఆమె.

ఎప్పుడూ కళకళ లాడుతూ వుండే కలవారింటి బిడ్డ శ్రీనాధ్. ఓ మాసం గడిచేటప్పటికీ విద్యార్థినీ విద్యార్థుల్లో యెక్కడ చూసినా వీరిద్దరి గురించి మాటలు. ఎన్నోసార్లు శ్రీనాధ్, శ్లేషలు సినిమాలకు, హోటళ్ళకు వెళ్ళడం నా కళ్ళారా చూశాను. శ్లేష అంటే నా కెందుకో ఓ విధమైన అనురాగం, అభిమానం, ఆరాధన. నేను రాసిన కొన్ని కథలకు ఆమె నాయకిగా నిలిచింది.

నా కథలు చదివి, నా దగ్గరికొచ్చి నన్ను అభినందించేది.

హాస్టల్లో నా రూము ప్రక్కనే వుండేవాడు శ్రీనాధ్. మా యిద్దరికీ మంచి స్నేహమే వుందని చెప్పాలి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేవాడు. ప్రతిసారీ అతన్ని శ్లేష గురించి అడగాలనున్నా—యెందుకో అడగలేక పోయేవాడ్ని.

ఒకరోజు మధ్యాహ్నం క్లాసు లేకపోవడంతో లైబ్రరీకి వెళ్ళి 'గాలిబ్ గీతాలు' చదువుకొంటున్నాను భోజన సమయం కాబట్టి లైబ్రరీ దాదాపు నిర్మానుష్యంగా వుంది. నా కొంచెం దూరంలో కిల కిలా నవ్వు. ఎవరా అనుకున్నాను. నాకు, ఆ నవ్వుకు మధ్య వో పుస్తకాల రేక్. అనుమానంగా రెండు పుస్తకాలు తొలగించి చూశాను. ఆ వైపు శ్లేష, మరో కొత్త వ్యక్తి. ఉన్నట్టుండి అతను శ్లేషను దగ్గరికి లాగి ముద్దు పెట్టుకొన్నాడు. ఎలాంటి అభ్యంతరమూ తెలుపకుండా అతని చెంపపై చిన్న దెబ్బ వేసింది శ్లేష. అంత

పబ్లిక్‌గా ఆ దృశ్యాన్ని చూడలేక పుస్తకాల్ని యథాస్థానంలో వుంచాను.

ఈ విషయాన్ని శ్రీనాధ్‌కు చెప్పాలనుకొంటూనే చెప్పలేకపోయాను. పాపం అతడామెను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఆమె లేనిదే జీవితం లేదనుకొనేవాడు. ఆమె కోసం యేం చెయ్యడానికైనా సిద్ధపడినవాడు. ప్రేమ మత్తు అతన్ని పూర్తిగా ఆక్రమించుకొని వుంది.

ఈలోగా యూనివర్సిటీలో అనేక పుకార్లు బయలుదేరాయి.

శ్లేషకు, వేశ్యకు యెలాంటి తేడా లేదని, పురుషుల్ని పురుగుల్లా చూస్తుందని యింకా యెన్నో, యెన్నో. శ్రీనాధ్ ఈ విషయాల్ని పట్టించుకోలేదు. నేనూ నమ్మలేదు.

హఠాత్తుగా ఓ ఇరవైరోజులు శ్లేష మాయమైంది. అన్ని రోజులూ చైతన్యా కాలేజీకి రాలేదు. చైతన్య కూడ డబ్బు విలువ తెలియని యింట్లో పుట్టినవాడే. అతని దృష్టిలో ఆడవంటే అనుభవించే వస్తువు. చైతన్యా శ్లేషా కలసి ఎక్కడికో పారిపోయారని యూనివర్సిటీ అంతా పుకారు.

నవ్వుతూ నవ్విస్తూ వుండిన శ్రీనాధ్ యెలాగో అయిపోయాడు. కాలేజీకి రావడం కూడా తగ్గించేశాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఏకాంతంగా గడిపేవాడు.

ఒకరోజు ఉదయం చైతన్యా శ్లేషా ఇద్దరూ కాలేజీకి వచ్చారు. కాలేజీ గగ్గోలెత్తిపోయిందా రోజు. శ్లేషా చైతన్యలు యూనివర్సిటీలో కలసి తిరగడం మొదలుపెట్టారు. యూనివర్శిటీలో తిరగలేక, తిరగకుండా వుండలేక నానా అవస్థ పడిపోతున్నాడు శ్రీనాధ్.

నాలుగు రోజుల తరువాత దాదాపు పదకొండు గంటలకు ఆడిటోరియం ముందర కూర్చుని మాట్లాడుతున్నారు శ్రీనాధ్, శ్లేషలు. వాళ్ళు పెద్దగా అరుచుకోవడంతో, అటూ ఇటూ తిరుగుతున్న విద్యార్థులతో కలసి నేనూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

"ఇదేం బొమ్మలాటా? నువ్వు వచ్చి తీరాలి" కోపంగా అన్నాడు శ్రీనాధ్.

"అది నా యిష్టం. నేను రాను" సౌమ్యంగానే చెప్పింది శ్లేష.

"వాడితో తిరిగితే చంపేస్తాను" శ్రీనాధ్ కళ్ళు ఎర్రబడ్డాయి.

"నా ఇష్టాన్ని ప్రశ్నించే హక్కు నీకు లేదు!...." కోపంగా అంటూ పైకి లేచింది శ్లేష.

"యూ డర్టీ ఓర్" (WHORE) ప్రక్కన మేమున్నా మనే విషయం కూడ మరచి ఊగిపోతూ పైకిలేచాడు శ్రీనాధ్.

"షటప్! మగతనం లేని నువ్వా మగాడిలా మాట్లాడుతున్నావు" అంది కోపంగా శ్లేష.

శ్లేష చెంప చెళ్ళుమంది. ఎర్రగా నెత్తురు కారుతున్నట్టయింది చెంప. ఎడమచేత్తో చెంప సవరించుకుంటూ, కంట్లో నీళ్ళు గిర్రున తిరుగుతుండగా కుడిచేత్తో చెప్పు తీసుకొంది శ్లేష. అర్థంకాక చూస్తున్న మేము ఇద్దరినీ ఆపి, శ్లేషను దూరంచేసి శాంతపరిచాము. విసురుగా వెళ్ళిపోయాడు శ్రీనాధ్.

జరిగిన అవమానాన్ని సహించలేక, అభిమానాన్ని చంపుకోలేక ఆ సాయంత్రమే ఆత్మహత్య చేసుకున్నాడు శ్రీనాధ్.

ఆడిటోరియం ముందు గడ్డిలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్న శ్లేషతో జరిగిన విషయం చెప్పాను. ఆమె నన్ను చూసి మెల్లగా నవ్వుతూ "పిరికివాడు" అంది. ఆ క్షణంలో ఆమెపై జనించిన అంతులేని అసహ్యంతో తిరిగి వచ్చేశాను.

శ్రీనాధ్ మరణ విషాదంనుంచి మేం తేరుకోక ముందే మొదటి సంవత్సరం గడచి రెండవ సంవత్సరం ప్రవేశించింది.


హాస్టలు నచ్చక నేను రూములో చేరాను. ఎన్నడూ లేనంతగా ఎలక్షన్ల గొడవ ప్రారంభం అయింది.

యూనివర్సిటీ ఛైర్మన్‌షిప్‌కు చైతన్య, విశ్వం పోటీ చేస్తున్నారు. ఇద్దరూ మంచి పాపులారిటీ వున్నవారే.

అందరినీ ఆశ్చర్యపరుస్తూ శ్లేష కూడ నామినేషన్ వేసింది. చైతన్యని విరమించుకోమని








Dr. B
Srikakulam

ఒత్తిడి చేసినా అతడు లొంగి రాలేదు. ఆమెతో అవసరం తీరిపోయిందతనికి. దానితో విశ్వానికి సన్నిహితంగా వెళ్ళింది శ్లేష. ఎన్నాళ్ళనుంచో శ్లేషకై అతడు యెదురుచూస్తున్నాడు. "నా అందం నీ సొంతం కావాలంటే పోటీనుంచి విరమించి నాకు సహాయం చేయి" అని అడిగింది శ్లేష. అందంకోసం రాజ్యాల్ని, సింహాసనాల్ని, జీవితాలనీ త్యాగం చేసినవాళ్ళున్నారీ గడ్డలో. విశ్వం వాళ్ళకంటే గొప్పవాడేమీ కాదు. నామినేషన్ విత్‌డ్రా చేసుకొన్న రోజున అతనిని తన అందపు ఆనంద సాగరంలో ముంచేసింది శ్లేష. విశ్వమూ, అతని వర్గమూ శ్లేషకై ప్రచారం చేయసాగారు. ఎవరికోసమైతే శ్రీనాధ్‌ని కాలదన్నిందో, అతన్నే వదిలేసి ఎదురునిలిచింది శ్లేష.

అందినా అందకపోయినా అందానికి మొక్కడం అందరికీ అలవాటు. ఊహించని మెజారిటీతో గెలిచింది శ్లేష. యువతి ఛైర్మన్ కావడం యూనివర్సిటీ చరిత్రలో అదే ప్రథమం.

ఎక్కడ చైన్యను చూసినా ఆడదాని చేతిలో, అదీ మాజీ ప్రేయసి చేతిలో ఓడిపోయాడని గుసగుసలాడుకోసాగారు. అవమానంతో కాలేజీ వదిలేసి స్వంత ఊరికి వెళ్ళిపోయాడు చైతన్య. ఫైనల్ యియర్ పూర్తయ్యేలోగా విశ్వానికి గుడ్‌బై కొట్టింది శ్లేష.

ర ర ర

"రాజూ, అడగటానికి మరింకే ప్రశ్నలూ లేవా?" అంటూ కుర్చీలోంచి లేచి మెల్లగా నా వరుపు దగ్గరికి చేరి దుప్పటి కప్పుకొంది.

ఏదో అగ్నిపర్వతం నాలో, లోలో బద్దలయి చలి వెచ్చగాను, వెలి చల్లగానూ అనిపించింది. నా ముఖాన్ని గోముగా చూస్తోంది శ్లేష.

"శ్లేషా! ఎందుకిలా పురుషుల జీవితాలతో ఆడుకొంటావు?" బాధగా ప్రశ్నించాను.

"వాళ్ళు నా జీవితంతో ఆడుకొన్నారు కాబట్టి" నవ్వుతోంది, బుసకొట్టే నాగుపాము పడగ దింపేస్తుందా నవ్వుకు.

"అంటే....?" కుతూహలంగా ప్రశ్నించాను.

"నీ 'అంటే'కు సమాధానం చెప్పాలంటే ఒక చరిత్ర రాయాల్సి వుంటుంది" నా చేతిపై తన చేతిని రాస్తూ అంది.

"అలాగే రాస్తాను" రచయితననే గర్వం నాలో.

"నాకు తెలుసు" అంది నవ్వుతూ—గడి

యారంలోని రెండు ముళ్ళూ 12 దగ్గర చలికి కౌగిలించుకొన్నాయి.

మరో సిగరెట్ వెలిగించుకొంది శ్లేష. ఇద్దరమూ ఒకే పరుపుపై ఒకే దుప్పటిలో.

పొగ వదులుతూ "ఎవరికీ తెలియని రహ శ్యాలు నీకు చెబుతున్నా రాజూ" అంటూ ప్రారంభించింది.

* * *

పుట్టిన ఐదేళ్ళవరకూ నాకు పుట్టాననే తెలీదు. ఆ తరువాత మెల్ల మెల్లగా జ్ఞానం విక సించి నేనూ ఓ జీవినని తెలుసుకొన్నాను. నాకు తోడు, నీడ, గూడు అంతా అమ్మే. అమ్మ లాలనలో ఏ సమస్యలూ, సందేహాలూ లేక సాఫీగా సాగిపోయేది జీవితం. ఈ విశాల రత్నగర్భలో ఓ హైస్కూలు ఉపాధ్యాయిని మా అమ్మ. జ్ఞానం వికసించినా తండ్రిని ఎరు గను నేను. నా చిన్నారి మనసులో తండ్రి ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం ప్రవే శించి పెరగసాగింది.

అప్పుడు నేనేం చదువుతున్నానో నాకు జ్ఞాపకం లేదు. కానీ ఆ సంఘటన, జీవితంలో యెన్నడూ మరచిపోలేను. సాయంత్రం స్కూలు నుంచి హుషారుగా వచ్చాను. అమ్మ వంటిట్లో కాఫీ పెడుతోంది. కాఫీ త్రాగి ముందు గదిలోకి వచ్చాను. అమ్మ వచ్చి లైటు వేసింది. అమ్మనే చూడసాగాను. ఆమె నే చూస్తున్న నన్ను చూసి "ఏమమ్మా అలా చూస్తున్నావు" అడిగింది. ఎలా అడగాలో అర్థం కాలేదు నా వయసుకు. నా దగ్గరగా వచ్చి కూర్చుని కుడిచేత్తో నా వెంట్రుకలు దువ్వుతూ యెడంచేత్తో నా గడ్డం పట్టుకొని "బళ్ళో యేమైనా జరిగిందా శ్లేషా?" బుజ్జగిస్తూ లాలనగా అడిగింది.

అమ్మ కళ్ళలోకి చూస్తూ "నాన్న మనిం టికి రాడా అమ్మా?" అడిగాను. అంతే! అమ్మ కొట్టిన దెబ్బకు ఎగిరి అవతలపడి ఏడుపు లంకించుకొన్నాను. కోపంతో వంటింట్లో కెళ్ళి పోయింది అమ్మ. ఏడుస్తూ ఏడుస్తూ అలాగే నిద్రపోయాను.

ప్రొద్దున్నే లేచి తయారై స్కూలుకు వెళు తుండగా "శ్లేషా ఇలా రా!" పిలిచింది అమ్మ. నర నరానా ప్రవేశించిన భయంతో వెళ్ళాను. నన్ను గట్టిగా కౌగలించుకొని ముద్దు పెట్టి "ఇంకెప్పుడూ అలాంటి ప్రశ్నలు వెయ్యకు శ్లేషా!" అంది. అమ్మ కళ్ళల్లో నీళ్ళు. నేనూ బావురుమని ఏడ్చేశాను.

ఆ రోజు అమ్మ ఎందుకు నన్ను కొట్టిందో చాలా కాలం వరకూ నాకే మాత్రం అర్థం కాలేదు.

మనసుతోపాటు వయసూ పెరిగింది. వయసుకు మించిన వన్నె శరీరానికి వచ్చింది. నా అందమూ అవయవ పొంకమూ చూసు కొని నాకు నేనే ఆశ్చర్యానందాలు పొందే దాన్ని.

ఇంటర్మీడియట్‌లో చేరడానికి అప్లై చేసిన రోజు రాత్రి నిద్రపోయే ముందు అమ్మ తన గదిలోకి పిలిచింది. "ఏమ్మా?" అంటూ తన గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. అమ్మ తలలో సగానికి సగం తెల్ల వెంట్రుకలు. వృద్ధాప్య ఛాయలు అమ్మలో బాగా కనిపిస్తు న్నాయి.

"శ్లేషా! పెద్దదానివవుతున్నావు. కొద్దిరోజుల్లో కాలేజీలో అడుగు పెడతావు. ఈ లోకం గురించి అందమైన ఊహలే తప్ప, ఇదొక సుడిగుండ మని మీ వయసు వాళ్ళెవ్వరూ తెలుసుకోరు" అమ్మ యెందుకిలా చెబుతుందో నాకే మాత్రం అర్థం కాలేదు.


"బయట లోకంలో అడుగుపెడుతున్నపుడు అనుక్షణం జాగ్రత్తగా వుండాలి. ఎక్కడ తప్ప టడుగు వేసినా పాతాళంలో పడక తప్పదు" భారంగా చెబుతోంది అమ్మ. కాసేపు మా యిద్దరి మధ్యా ఘనీభవించిన నిశ్శబ్దం.

"శ్లేషా! గుర్తుందా నీ చిన్నప్పుడు ఒక రోజు నీ తండ్రిని గూర్చి అడిగావు?" మౌనంగా తలూపాను.

రెండు డైరీలు నా చేతిలో పెట్టి "ఇవి చదువు. నీకే అర్థమవుతుంది" అన్నది. డైరీలు తీసుకొని నా గదిలోకి వచ్చాను. అవి చదివి నా తండ్రి గురించి తెలుసుకొన్నాను. బి.ఇ.డి.








ట్రెయినింగ్‌లో వుండగా అతనూ మా అమ్మా ప్రేమించుకొన్నారు. అతను యెవరూ యేం పేరూ అని ప్రశ్నించకు—రూపురేఖలే స్మృతి పథంలో లేని వ్యక్తి పేరు తెలుసుకొని మాత్రం ఏం ప్రయోజనం.

అతని కోసం మా అమ్మ అంతస్థునీ తలి దండ్రుల్నీ వదిలేసింది. కాని వాడు వాటి కోసమే నన్ను ప్రసాదించి నా తల్లిని వదిలే శాడు. ఒంటరిదైన మా అమ్మకు కడుపులో ఉన్న నేనే తోడయ్యాను. అందరిలా అధైర్య పడక ఉద్యోగం ఆసరాతో అమ్మ నన్ను పెంచి పెద్ద చేసింది.

ప్రేమకోసం తల్లిని, తండ్రిని, అంతస్థును, పరువూ మర్యాదల్నీ జీవిత సర్వస్వాన్నీ త్యాగం చేసిన స్త్రీ కోసం ఏ చిన్న త్యాగమూ చేయలేక పోయాడు పురుషుడు. ఆ క్షణం లోనే పురుషులపై ద్వేషం నాలో అంకు రించింది.

బి. ఏ.లో చేరిన మొదటి రోజుల్లో అమ్మకు రామాపురం ట్రాన్స్‌ఫర్ అయింది. అమ్మ ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే వుంది. నేను హాస్టల్‌లో చేరాను. రైలు ఎక్కించి ఏడుస్తున్న నన్ను చూసి "పిచ్చిపిల్లా, ఎందుకే ఏడుస్తావ్? వారం వారం వచ్చి చూస్తుం టానుగా" అంటూ వెళ్ళిపోయింది అమ్మ.

కొన్ని నెలలు హాయిగానే గడిచాయి. ఒక రోజు అమ్మకు సీరియస్‌గా వుందంటూ టెలి గ్రాం వచ్చింది. నేను రామాపురం చేరే లోపలే అమ్మ ఇహాన్ని విడిచేసింది. అనంత విశ్వంలో వున్న ఒక్క తోడును పోగొట్టుకొని ఏకాకిగా మిగిలిన నేను అమ్మ నిర్జీవ శరీరంపై వెక్కి వెక్కి యేడుస్తూ పడిపోయాను. మిగతా తతంగాన్నంతా ఊరి పెద్దలే నిర్వహించారు.

అమ్మ నివసించిన యింట్లో ఒక్కదాన్నే శూన్యంగా శోకంతో జ్ఞాపకాలతో నాలుగు రోజులు గడిపాను. భవిష్యత్తు అంతా ప్రశ్నా చిహ్నంగా తోచింది. అయిదవ రోజు రాత్రి సుమారు పదిగంటలప్పుడు ఊరిపెద్ద లిద్దరూ ఇంటికి వచ్చారు.

ముందర గదిలో కూర్చుని "బాధపడకమ్మా జరిగేది జరక్క మానదు. యింత శోకంలో వుండికూడ మేం ఎంతమంది పిలిచినా మా యిళ్ళకు రాకపోయావు" అంటూ ఊరడించడం మొదలుపెట్టారు.

ఓ గంట అలాగే గడచిపోయింది. ఊరంతా భయంకరమైన నిశ్శబ్దం. నిండు పున్నమి లాంటి నా అందం వారిలోని కామ సముద్రాన్ని రెచ్చగొట్టింది. ఒకడు లేచి వచ్చి నా భుజంపై చేయి వేశాడు. శోకంలో వున్న నేను అదీ ఒక విధమైన లాలింపనుకొన్నా. నేను ప్రతి ఘటించక పోవడంతో కౌగలించుకొన్నాడు. అప్పటికి అసలు స్థితిని అర్థం చేసుకొన్న నేను విదిల్చి కొట్టబోయాను. కానీ కిరాతకులు, తల్లి పోయిన దుఃఖంలో వున్నాననికూడా యెంచక, వయసులో యెంతో చిన్నదాన్నని తలచక, ఏ దిక్కూ లేని అనాథనని భావించక, క్రూరంగా, రాక్షసంగా నాపై పడ్డారు. ప్రతిఘటించి, ప్రతి ఘటించి శక్తిలేక శోష వచ్చి పడిపోయాను. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలీదు.

వేకువ వేళ మెలకువ వచ్చింది. అస్త వ్యస్తమైన బట్టలు, ఒళ్ళంతా నొప్పులు. ఆత్మ హత్య చేసుకుందామని బావి దగ్గరికి వెళ్ళాను. కానీ "ఎందుకు చావాలి? చచ్చి ఎవరివి సాధిం చాలి? పురుషుడి క్రౌర్యానికి అబల బలై పోవల సిందేనా? ఈ తప్పు నా దెందుకవుతుంది?" బావి అంచున నిలబడ్డపుడు ఉదయించిన ఈ ప్రశ్నలే నన్ను జీవింప చేశాయి.

నా తల్లి ఏదో కొద్దిగా మిగిల్చిన డబ్బే నా చదువుకు, జీవితానికి ఆధారమైంది. కానీ నిజా నికి అది ఏ మూలకూ చాలదు.

అంతే ఆ రోజు నుంచి, పురుషుల్ని బొమ్మలుగాచేసి ఆడుకొంటున్నాను. అందాన్ని ఎరగా చూపి వాడి పతనానికి, నా ఔన్నత్యానికి బాటలు వేసుకోసాగాను.

ర ర ర

శ్లేష కళ్ళనిండా నీళ్ళు. ఆ స్థితిలో ఆమెను చూసి కరిగిపోయాను.

"టైమెంత రాజా?" అడిగింది.

పరుపుకు పక్కగా పారేసిన గడియారాన్ని తీసి చూశాను. అయిదవుతోంది. తెల తెలవారు తోంది. దుప్పట్లోంచి లేచి బట్టలు కట్టుకోవడం ప్రారంభించింది శ్లేష. ఆమె ఒంటికి చుట్టు కొంటున్న చీరను చూసి సత్యపు నగ్నత్వంపై ఏదో ముసుగు కప్పుతున్నట్లనిపించింది. "ఈ పాలరాతి బొమ్మ వెనుక యింతటి విషాదపు చీకటి ఛాయ వుందా?" అనుకొంటూ సిగరెట్ వెలిగించాను.

"నిన్నాశ్చర్యపరిచే మరో విషయం చెప్పనా రాజా...." అంది శ్లేష పైట సర్దుకొంటూ.

"ఊఁ" అన్నాను.

"రామాపురంలో రాక్షసంగా నన్ను వశ పరచుకొన్న ఒకడి కొడుకే శ్రీనాధ్" అంది గోడవైపు చూస్తూ.

నిజంగానే ఆశ్చర్యపోయాను. "తండ్రిపై పగ కొడుకుపై తీర్చుకున్నావా?"

"లేదు రాజా, ఒక పురుషుడిపై వున్న పగ మరో పురుషుడిపై తీర్చుకొన్నాను. వెళ్తాను రాజా!" వెళ్ళడానికి సిద్ధపడుతూ అంది.

"ఎక్కడికి వెళతావు శ్లేషా?" అడిగాను నాతో ఉండిపొమ్మని అనలేక.

పక పకా నవ్వుతూ "ఎక్కడికా, అనం తంలోకి. ఔన్నత్యంలోకి. మీలోని బలహీనత నాధారం చేసుకొని ఊహించని ఉచ్ఛస్థితిలోకి" అంది చిలిపిగా.

నాకు తెలుసు-నేను ఆపినా ఆమె ఆగదని.

తలుపులు తెరచి బయటికి అడుగేయ బోతున్న ఆమెతో "శ్లేషా! ఒక్క ప్రశ్న?" నాలోని ఆందోళనను వెలివర్చుకోవాలని నా తపన.

అడుగు వెనక్కి వేసి "యేమిటి?...." అంది.

"నువ్వు నన్ను....ప్రేమించావా?" మాటలు తడబడ్డాయి.

"లేదు" స్థిరంగా అంది.

"మరి అనుకోకుకుండానే నా దగ్గరికొచ్చి రాత్రంతా నాతో గడిపి" నా మాటలు పూర్తి కాకుండానే "పిచ్చిరాజా అందరిలా నువ్వూ నన్ను కోరుకొన్నా, వాళ్ళకంటే ఎక్కువగా నిజంగా ఆరాధించావు. అందుకే....అంతకన్నా మరేం లేదు" సూటిగా స్పష్టంగా చెప్పింది.

"రాజా! కోరుకున్నప్పుడు నీ దగ్గరికి వచ్చి వెళ్ళే స్వాతంత్ర్యం నాకే మిగుల్చు. మౌనంగా తలూపాను.

గదిలోకి ప్రవేశించిన సూర్యుని లేతకిరణాలు ఆమె పాదాలపై పడ్డాయి. ఎర్రగా ప్రక్షాళిత పద్మాల్లా కనిపించాయామె పాదాలు. మెల్ల మెల్లగా అడుగేస్తూ వెళ్ళిపోయింది శ్లేష. □

